# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–2 జనవరి 28, 2015

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులన్నింటిని అభివృద్ధి పరిచి పేదలకు వైద్యం అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకు ప్రభుత్వ వైద్యులు సహకరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి, ఎంపి బూర నర్సయ్యగౌడ్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.వీరేశం, కార్యదర్శి శ్రీనివాస్ కోశాధికారి రాంసింగ్, నాయకులు నాగేందర్, లింగం గౌడ్, జూపల్లి రాజేందర్, శ్రీధర్ రెడ్డి, ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్ శాఖ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ తదితరులు సచివాలయంలొ బుధవారం ముఖ్యమంత్రి కలుసుకున్నారు. తెలంగాణలో ప్రభుత్వ వైద్య శాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శాలల్లో ఖాళీల భర్తీతో పాటు ఇతర అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులకు సంబంధించి సమస్యలు, పెండింగ్ డిమాండ్ల పరిష్కారం పట్ల ప్రభుత్వం అత్యంత సానుభూతితో వ్యవహరిస్తుందని హామినిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి మొదులుకొని హైదరాబాద్‌లో ఉన్న ఉస్మానియా, గాంధీ లాంటి ఆసుపత్రుల వరకు అన్నింటిని మెరుగు పరచాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నదని చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖకు విస్తృతమైన యంత్రాంగం ఉన్నదని చెప్పారు. బడ్జెట్‌లో కూడా వైద్య రంగానికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు నగర, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే వారితో పోలిస్తే తక్కువ హెచ్ఆర్ఎ వస్తున్నదని, దానితో పాటు ఇతర సమస్యలు కూడా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే

వైద్యులకు అదనపు ప్రోత్సాహకాలు, మినహాయింపులు ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందని వెల్లడించారు. ప్రభుత్వ పరంగా చేసే ప్రయత్నాలతో పాటు ప్రభుత్వ వైద్యుల సహకారం, చిత్తశుద్ధి కూడా అవసరమని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. వైద్యులు కష్టపడి పనిచేస్తే ప్రైవేటు కన్నా ప్రభుత్వ వైద్య శాలలే మిన్న అనే పరిస్థితిని తెలంగాణలో కల్పించవచ్చని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని మెరుగుపరిచే విషయంలో ఏలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించేందుకు త్వరలోనే రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

నగరంలోని ఛాతి వైద్యశాలను నగర శివారులోని వికారాబాద్ ప్రాంతానికి తరలించే విషయంలో ప్రభుత్వానికి పూర్తి సహకారం వుంటుందని ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు ముఖ్యమంత్రికి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న వైద్య శాల నగర మధ్యలో ఉండడం వల్ల పేషంట్లకు ప్రశాంతమైన వాతావరణం కరువయ్యిందని, కాలుష్యం వల్ల క్షయ వ్యాధి గ్రస్తులు ఇబ్బంది పడుతున్నారనే ప్రభుత్వ అభిప్రాయంతో వారు ఏకీభవించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం